# ఏ మేటరాఫ్ నో యింపార్టెన్స్

"ఒక పరిస్థితిలో ఏ ఒక్కరైనా ఒకేలాగ ప్రవర్తిస్తే, ఆ ప్రవర్తన ఏమైనప్పటికి నేరం కాదు. ఆ పరిస్థితే నింద్యమైనది. దాన్ని సృష్టించిన వారే నేరస్థులు కావచ్చు. దానిలో చిక్కుకున్న వారు దోషులుకారు"

అవి మూడు జతల తొడలు. జవజవలాడుతున్న జవ రాళ్ళవి, దొరసాన్లవి!

ఆ వాల్‌పోస్టరు చూసి తల్లినీ, చెల్లినీ తల్చుకునేవాడు మహర్షో, మందదృష్టివాడో అయివుండాలి. ఆ పోస్టరు చూస్తున్న సత్యం చూపుకి గెద్ద, అతనికి మహర్షి అయ్యే చిహ్నాలేవీ లేవు.

రిక్షాలో కూర్చునీ సీటుకు కాళ్ళు నిగడదన్ని విలాసంగా బీడీ కాలుస్తున్న అతను పనస తొనల్లాంటి ఆ తొడలని మరోసారి చూసి "ఆడముండకి గుడ్డవిప్పినా, కట్టినా దొరే సెయ్యాలి గురూ!" అన్నాడు.

పక్క రిక్షాలో గురుడు గుర్రు పెడుతున్నాడు. "రికసా ఓడికీ, రంకు ముండకీ రేత్తిరి నిద్దరేటి నెగు నెగు" అని సత్యం పక్క రిక్షాని కాలితో తన్నేడు. ఆ తాపుకి ఓరుండేస్ అంటూ కళ్ళు తెరిచేడు సింహాచలం. తెరిచిన అతని కళ్ళకి మెరుపుతీగను తెచ్చి అద్దాల బీరువాలోబిగించేసినట్టు కనిపించింది, ఎదుటి షాపులో అప్పుడే పెట్టిన కొత్త బొమ్మ.

ఆ బొమ్మ ఒక ఆడదాన్ది, ఆ బొమ్మకే ప్రాణం వస్తే, ఆమె కోసం మహర్షులు కూడా మర్డర్లకి వెనుదియ్యరు. ఆమె ఒక చుక్కల చీర సగమే కట్టుకుంది. మిగతా సగమూ కట్టుకోక పోవడానికే నిశ్చయించుకుంది. ఈ చీర చుక్కలరాత్రి తళుకులా సింహాచలం కళ్ళలో మెరిసింది. ఆ చీక కప్పని వంపులు వెన్నెల వలపుల్లా అతని ఎముకల్లో మెదిలేయి.

ఆ చీర "ముగ్గురు మొగుళ్లు" చీర, ఖరీదైన ఇరవై రూపాయ లని చీరకున్న బిళ్ళ చెబుతోంది.

సింహాచలం అంతకు ముదు రాత్రి "ముగ్గురు మొగుళ్ళు" సినిమాకి రాజమ్మతో వెళ్ళేడు. ఆ సినిమాలో బీద హీరోయిన్ కాలేజీకి హీరో కార్లో వెళ్ళి, హీరోయిన్ని యింటికి దిగబెడతానని కార్లో ఎక్కించుకున్నాడు. కారు ఊరు దాటడం కనిపెట్టిన హీరో యిన్ బెదురుబెదురుగా "యిటెక్కడికి?" అంది, ఇంకా ఎక్కడికో తీసుకు పొమ్మన్నట్టు వళ్ళు వెయ్యి వంకలు తిప్పి.

హీరో కారేపేసేడు. ఆపేసి, కార్లో వున్న హీరోయిన్ని ఎత్తు కొన్ని పరుగెత్తి పాదాలలోతు పన్నీరులా ప్రవహిస్తున్న సెలేట్లో నిద్రపోతున్న నీటి ఏనుగులా ఉన్న ఒక నల్లబండ మీద నిలబెట్టి "యిక్కడికీ!" అన్నాడు. అ పలుకే పెద్ద విట్టులా నవ్వుతూ "అమ్మ దొంగా" అంది హీరోయిను, "అమ్మ దొంగా" అన్నప్పుడల్లా పాడే "కీబొమ్మలా హీరో" దొంగవు నువ్వే.. గజదొంగవు నువ్వే... అన్న పాట రెండు చరణాలు పాడేడు. పాడుతూ మత్తగజంలా అరిచేడు. అరుస్తూ నీట్లో దొర్లేడు. బండ మీద మొగ్గలు వేసేడు. ఆఖరుని అలిసి పోయిన పిల్లడు తల్లి దగ్గరకు పోయినంత అమాయకంగా హీరోయిన్ దగ్గరకెళ్ళి ఆమె చెంగు పట్టు కున్నాడు. వెంటనే హీరోయిన్ మూడో చరణం పాడుతూ వానా వానా చల్లప్ప తిరిగింది. తిరగడంలో ఆమె చీర కుచ్చెళ్ళ వరకూ విడి పోయింది.

విడిపోయిన ఆమె చుక్కల చీర మణులు పొదిగిన మంచు తెరలా ఉంది.

ఆ చీరలోంచి ఆమె వంపులు ఆకర్షణీయంగా కనిపించే టంత అస్పష్టంగానూ, యింకా చూడాలని కోరుకునేంత స్పష్టం గానూ కనిపించేయి. ఆ సీను అందరి ప్రేక్షకుల హృదయాలనూ దోచుకుంది. ఆ సీను చూసిన ప్రతి ఆడదీ అలాంటి చీరకోసం తహతహలాడింది. ప్రతి మొగాడూ అలాంటి చీర తన ప్రియు రాలికి కొనాలని తహతహ లాడేడు.

సినిమా నుండి వస్తూ ఆ "కోక బావుంది" అని "గదూ" అని కలిపింది రాజమ్మ. అది విన్న సింహాచలం ఔనౌను అనే సేడు. "నిన్నూ, నన్నూ కలిపి తాకట్టు పెట్టినా కూడా ఆ చీర ఖరీదు రాదు" అని ఆ ఔనౌను అర్థం.

ఆ రాత్రి నిద్ర పట్టలేదు సింహాచలానికి. ఆడదానికి నచ్చిన చీర కొనలేని మొగుడూ ఒక మొగుడేనా అన్న సందేహం వచ్చిం దనికి. "కాదు" అన్న సమాధానం కూడా వచ్చింది. తనమీద తనకే అసహ్యం వచ్చిందనతనికి.

దగ్గర దగ్గర పదిహేనేళ్ళ కాపురంలోనూ రాజమ్మ అతన్ని ఏమీకోరలేదు. ఆఖరికి అమ్మలాంటి తన అరణం ఆవుని కోర్టు అమీనా తీసుకుపోతున్నప్పుడు కూడా దాన్ని విడిపించమని కోరలేదు. తన కంటే, కాసుల పేరూ కోర్టు ఖర్చులకి కరిగిపోయి,

నాగరం, నల్లపూసా పోయినా, పసుపు కొమ్ముతో నవ్వే నగగా మిగిలిపోయినా ఆమె ఆనందంగానే ఈదుతోంది సంసారపు విషపు లోతుల్ని.

బతుకులోని భారం అంతా సంతోషంగానే మోస్తోందామె. రైతుకి పుట్టి రైతునే కట్టుకొని, కవలపిల్లల్ని పోగొట్టుకొన్నట్టు అటు పుట్టినూరికీ, యిటు మెట్టినూరికీ దూరమై పట్నంలో అంట్లు తోముకు బతుకుతున్నా ఆమె బాధపడలేదు. "నచ్చింతల్లి నాగ నువ్వొక్కర్తివె మిగిల్నావు నాకు" అని సింహాచలం అన్నప్పుడు మినిష్టరైన "ఆడ ఎంపీలా" ఆమె గుండెలు సంతోషంతో బరువెక్కి పోతాయి.

అటువంటి రాజమ్మ "సేపంకొద్దీనాకు దక్కింది గాన్నేక పోతే పురాణాల్లో పుట్టుండును" అని సింహాచలం అనుకునే రాజమ్మ ఆ చీర బాగుందని అన్నప్పుడు "ఔనౌను" అని మాత్రం అన గలిగిన తనకి "అకిరికి రాజమ్మ కూడా చెమించదు" అను కున్నాడు సింహాచలం. రాజమ్మకి కోకకాదు సరిగదా పకోడీలు కొనడానికి కూడా పదిపైసల్లేవు అతని దగ్గర. ఏడేళ్ళె అతను తొక్కుతున్న రిక్షా, రిక్షా ఓనరుదే.

మూడేళ్ళె వుంటున్న గుడిసె గుడిసేటి దానిదే.

అతని ఐదెకరాలు పోయేయి. ఇదివరకుండే చల్లని యిల్లు యిప్పుడతన్ది కాదు. గతంలో పరువూ, భవిష్యత్తులో ధీమా, మంచీ, మమతా స్నేహాలూ, చుట్టరికాలు అన్నీపోయేయి.

"ఆఖరికి అడుక్కుతినే కాడికొచ్చినాది జనమ" అన్న విచారం "సావుకోరి కేసులో సాచ్చీకం సెప్పేసినా బాగుండి పోను" అన్న రిగ్రెట్ మాత్రం మిగిలేయి.

అతను పుట్టిన వూల్లో షాపుకారు మూడు ముఖాల్లేని సృష్టికర్త. మూడు కళ్ళులేని లయకారుడు. అతని దగ్గర అప్పుపుచ్చుకోని మనిషి ఆ వూళ్ళో లేడు. ఇచ్చిన డబ్బుకి రసీదు అతను స్వంత తల్లికి కూడా ఇవ్వడు. ఊళ్ళో పదోవంతు భూములు అతని స్వంతం. మరో పదోవంతు తాకట్టులు వాకట్టులు అవగానే అతనివే అవుతాయి.

లొంగినవాడికి పదిరూపాయలు మాపుచేసి ధార్మిక బుద్ధితో పాటు, అతనికి ఎదురు తిరగినవాడిని వారు బాకీ వున్నది పది రూపాయలే అయినా, పదివేలు ఖర్చుచేసి మసిచేసేసే పట్టుదలా, బిజినెస్ టాక్టిక్సు వ్యవహార వ్యూహ రచనా కూడా అతనికి ఉన్నాయి. అతనికి ఎదురు తిరిగి బూదిదైపోయిన వాళ్ళల్లో అప్పల్నాయుడు ఒకడు.

కోర్టులో కొన్న అప్పల్నాయుడి భూమిని అమీనా ద్వారా స్వాధీనం చేసుకొని, స్కూటరు మీద వస్తున్న షాపుకారు కొడుక్కి ఎక్కడి నుంచో రాయివచ్చి తగిలింది. అతను స్కూటరు ఆపగానే చెట్టుచాటునుండి పులీ, ఎలుగుబంటీ కలిసి చేసిన వింత మృగంలా అప్పల్నాయుడు వచ్చి, అతన్ని పట్టుకొని, కసుక్కున్న గుండ్లో కత్తిగుచ్చి పారిపోవటం ఏటినీళ్ళూ, చెట్ల పూలు మాత్రం చూసేయి. ఆ తర్వాత అరగంటకి అక్కడికి వచ్చిన అమీనా, సింహాచలం వగైరాలకు కనిపించినవి పడిపోయిన స్కూటరూ, చచ్చి పడున్న షాపుకారుకొడుకు కళ్ళల్లో అప్పల్నాయుడు వేసిన భయం ముద్రా మాత్రమే.

ఖూనీ కేసు ఖూనీ కేసులాగే దర్యాప్తు జరిగింది. షాపుకారు సంచులుకోసేడు. చూడని నేరం చూసినట్టు చెప్పేవారికి ఎటు వంటి కొరతా విచారం లేకుండా చేసే భారం తనదన్నాడు.

అమీనా పట్నపు గరళపు నీడల్లో పెరగిన వ్యక్తి. ఖూనీ కత్తి అంచు మెరుపు, ఎర్రదనం, పోర్జరీ సిరా నల్లదనం అతన్ని భయపెట్టవు. పదిమంది పిల్లల్నీ, పాత మొగుడ్ని వదిలేసి లేచి పోయిన ఆడదీ, తల్లినీ, పిల్లనీ ఉంచుకున్న విటులూ, డబ్బు ముట్టలేదని ఆపరేషను చెయ్యని గవర్న మెంటు డాక్టరూ, పది రూపాయల కోసం అబద్ధం సాక్ష్యం చెప్పే ఐశ్వర్యవంతులూ, అతని దృష్టిలో సామాన్యదారులు, దేవుడి సాక్షాత్కారం, కోర్టు సాక్ష్యంలో నిజంమాత్రం అతన్ని ఆశ్చర్యపరచగలవు. ఒక నిజం కేసు నిలబెట్టడానికి అబద్ధపు సాక్ష్యం చెప్పటం అతను తన నైతిక విధిగా తీసుకున్నాడు.

అమీనాకి వున్న నైతిక సర్దుబాటు సింహాచలానికి లేక పోయింది. చూడనిది చూసేనని అనలేనన్నాడు. అనగలి గినా ప్రమాణం చెయ్యలేనన్నాడు. అప్పల్నాయుడు పిల్లలో దన్నాడు. "ఆడి పెళ్ళాం ఉసురు పోసుకోలేనన్నాడు. ఈ పాలికి ఒగ్గీమని" షావుకార్ని ప్రార్థించేడు.

చిన్న పిల్లడికి నచ్చజెప్పినట్టు అతనికి నచ్చజెప్పేడు షావు కారు. తన కొడుకుని అప్పల్నాయుడు తప్ప యింకెవరూ పొడవ లేదన్నాడు. దౌర్జన్యాన్ని అబద్ధం సాక్ష్యం చెప్పి అయినా శిక్షిం చాలని ధర్మపన్నాలు చెప్పేడు. చెప్తే సింహాచలం పొలం మీదున్న ఐదువేల తనఖా వదిలేస్తానని ఆశ చూపించేడు. చెప్పక పోతే రసీదు లేని నాలుగేవేల రూపయ చెల్లులూ తొక్కేసి, పూర్తి మొత్తానికి దావా చేసి, అతని భూమినీ, యింటినీ కొనేసుకొని నిన్ను బికారిని చేస్తాను అని బెదిరించాడు.

బికారిని చేసేడు.

"....సేసి బతుకులో పసుపు తుడిసేసినాడు" అని కొడుకుని ఎత్తుకొని యిల్లు వదిలివస్తూ రాజమ్మ అన్నప్పుడు ఆమె కంటి ముత్యం పేలిపోయి గుమ్మం పసుపుమీద పడి యింకి పోయింది.

"ఆడు తలుసుకుంటే యిలాంటివి పదిస్తాడు" అని తనకు తనే ధైర్యం చెప్పుకున్నాడు సింహాచలం.

కాని "ఆడు" తల్చుకోలేదు.

ఆలోచనలు ఎడారి దుమారంలో మనసుని చుట్టుకున్న సింహాచలానికి సత్యం పక్క బీడీల దుకాణం దగ్గరకి వెళ్ళడం, అతని వేపు తిరగడం కనపడలేదు. సింహాచలం మొహంలో వచ్చిన మార్పుకి అతను కొత్త మనిషిలా కన్పించేడు సత్యానికి. ముప్పై ఐదేళ్ళ వయస్సే వున్న సింహాచలం నలభై ఐదేళ్ళ వాడిలా కనిపిస్తాడు. అరడుగుల పొడువూ, దానికి తగిన ఒడ్డూ వున్నా అతను అది పర్వంలోని భీముడిలా కాకుండా అరణ్యపర్వంలోని భీముడిలా నీరసంగా వుంటాడు. అతని ముఖంలో ధర్మజుని శాంతమే కాని, భీముని రౌద్రం కనిపించదు. అతను రిక్షా తొక్కుతూ వుంటే మూడు చక్రాల సైకిలు తొక్కుతున్న ముస లాడిలా ఆక్వర్డులా కన్పిస్తాడు. తలుచుకుంటే ఎదుటి వాడి కాళ్ళు రెండూ పీకేసి వాడి చేతిలోనే పెట్టేసే బలం వున్నప్పటికీ అలాంటి దుర్మార్గం చెయ్యలేని "మంచితనం" వల్ల కలిగిన నీరసం అతని కళ్ళలో కన్పిస్తుంది, అతని జుత్తు నల్లగా వంకీలు తిరిగి అతి దట్టంగా ఉండటం వల్ల జెయింట్ సైజుకి ఎదిగి పోయిన ఇడి యట్‌లా కన్పిస్తాడు అతను. అతను తొడుక్కున్న సైజు బనియను చేతులు అతి పొట్టివి కావడం వల్ల రిక్షా తొక్కుతున్న అతని చేతికండలు ఎర్రటి ఎండలో రాతి కండల్లా కన్పిస్తాయి.

మోకాళ్ళ వరకూ ఎగ్గట్టిన అతని పంచ కొన్ని చిరుగులు మాత్రమే దాస్తుంది.

అతని తలకు చుట్టుకున్న గుడ్డ కాలేజీ పిల్ల జాకెట్టుక్కూడా సరిపోదు.

సింహాచలానికి సత్యం అసాధారణ పరిస్థితుల్లో పరిచయ మయ్యేడు.

ఒక బంగారు ఉదయాన బంగారుకొండలాంటి ఒకడిని రిక్షా ఎక్కించుకొని కూర మార్కెటు దగ్గర దింపేడు సింహాచలం.

"ఇప్పుడే వస్తానుండు(( అంటూఅతను మార్కెట్లోకి వెళ్ళేడు. వెళ్ళినవాడు మూణ్ణిమషాల్లో తిరిగి వచ్చేసేడు. తల్లినీ, పిల్లనీ ఒక్కసారిపోగొట్టుకున్న వాడిలా అతను కుంగిపోయి వున్నాడు. ఆ విచారానికి అతనికి జుట్టుంటే రాలిపోయేది. మీసం వుంటే పండిపోయేది. అతని పక్కనున్న హెడ్డు యినప కొండలా బలంగా, లావుగా వున్నాడు. నీ దుమ్ములు ఏరేసి వాటిని సుద్ద ముక్కల్లా రాసెయ్యగల బలం అతనికుంది. బొచ్చుకుక్కని ఒక్కొక్క వెంట్రుక పీకి చంపెయ్య గలిగే క్రౌర్యం అతని కళ్ళల్లో వుంది. అతని పక్కనున్న సత్యం మాత్రం బొచ్చుపోయిన కుక్క పిల్లలా దీనంగా, చూసేవాళ్ళకి జాలీ, అసహ్యం ఒక్కసారే కలిగేట్టు వున్నాడు.

అతని కళ్ళల్లో ఇతరుల దయాదాక్షిణ్యం చూడని మనిషి అపనమ్మకం ఉంది.

అతని జుట్టు ఎప్పుడూ దువ్వనట్టుంది.

అతని పేంటు ఎప్పుడూ ఉతకనట్టుంది.

అతని మొహాన ఉన్న దెబ్బ మాత్రం ఎర్రగా, తాజాగా పగి లిన దానిమ్మపండులా ఉంది.

వాళ్ళను చూసిన సింహాచలం రిక్షా ఎదురు తీసికెళ్ళి "ఏటైనాది బాబు" అన్నాడు.

"పరుసు" అని ప్రాణం పోతున్న మనిషిలా బెక్కేడు కూరలు కొనడానికి వచ్చిన మనిషి.

"పోతే పోనాది ఎక్కండి బాబు" అంటూ వెనక్కి తిరక్కుం డానే రిక్షా సీటుమీద కొట్టేడు సింహాచలం.

గుండు దెబ్బతిన్న పిట్టలా పర్స్ బంగారుకొండ కాళ్ళ దగ్గర పడింది.

తర్వాత కథ సుఖాంతం.

పర్సు దొరికినందుకు సంతోషంతో హెడ్డు సత్యాన్ని కొట్టాడు. అది తియ్యనందుకు మరోసారి కొట్టేడు. "నీ యదురుష్టం బాగుండి పోనాది పొమ్మన్నాడు. అతను పోయీలోగా "మాపిటికి టేసన్‌కి రా" అని ఆర్డరేసి పర్స్ మనిషితో వెళ్ళిపోయాడు.

వాళ్ళు వెళ్ళిపోయేక "నీ యిల్లెక్కడ" అని అడిగేడు సింహా చలం సత్యాన్ని. హైదరాబాదు నవాబుగుగార్ని హైదరాబాద్‌లోనే ఆ ప్రశ్న అడిగినా, వారు సత్యమంత ఆశ్చర్యపోరు.

సత్యానికి, సూపరెంటుగారి అబ్బాయికీ పద్ధతి ప్రకారం ఒకే అవకాశాలూ, హక్కులూ వున్నాయి. కాని సత్యం యిల్లు యింకా కట్టబడలేదు.

"మీ యమ్మ"

భూదేవి వంక చూసేడు సత్యం.

"మీ బాబు?"

నింగిని తొంగిచూసేడు అతను.

"పోనారా?"

"తెల్దు?"

సెక్సు కుళ్ళులో పుట్టిన పురుగు సత్యం. అతను పుట్టేక అతన్ని తల్లి కన్నువిప్పి చూడలేదు. తండ్రి కావాలనే నిర్దయగా, రాక్షసంగా, క్రూయల్‌గా, మెర్సిలెస్‌గా కాదని కాలువ వద్దున పారేసేడు.

అతనికి జరిగిన అన్యాయానికి ప్రకృతి విలయ తాండవం చేసింది. ఆకాశం కడుపు చించుకొని ఏడ్చి అతనికి పురిటి స్నానం చేయించింది. ఆ తర్వాత ఆ అన్యాయం తలుచుకొని బాల భానుడు మండిపడి సత్యం వళ్ళువత్తేడు.

ఆ తర్వాత వెంకన్న కంటపడ్డాడు సత్యం. వెంకన్న పగలంతా దగ్గుతాడు. రాత్రి మాదాకవళం అడుక్కుంటాడు. అతని కింద అప్పటికే ఇద్దరు ముష్టి పిల్లలు పనిచేస్తున్నారు. వాళ్ళలో ఒకడికి కాళ్ళు లేవు. రెండో వాడికి కళ్ళు లేవు.

దొరికిన పిల్లడికి వెంకన్న సత్యం అని నామకరణం చేసేడు. సత్యాన్ని పోషించవలసి వచ్చినందుకు వెంకన్న విచారించలేదు. అతన్ని ఒక పెట్టుబడిగా స్వీకరించి సంతోషించేడు.

మూడు నెలలు వచ్చేసరికి సత్యం ఖంగుమని ఏడవటం నేర్చుకున్నాడు. "ఫర్లేదు మూడీదులు యినిపిస్తాది గొంతుకు" అని అంచనా వేసుకున్నాడు వెంకన్న.

సత్యాన్ని కింగ్ ఆఫ్ బెగ్గర్స్ చేద్దామనే వెంకన్న ఆశ. అలా చెయ్యడానికి అతను అనవసర తొందర పడలేదు. సత్యం కాళ్ళు విరిచెయ్యడమో, కళ్ళు పొడిచ్యెడమో నిర్ణయించుకోలేక రెండేళ్ళు దగ్గి దగ్గి ఒక కాళరాత్రి కన్ను మూసేడు అతను.

వెంకన్న పోగానే కుంటివాడూ, గుడ్డివాడూ కనిపించ కుండా పారిపోయేరు.

చావు అంటే ఏమిటో తెలియని సత్యం వెంకన్న కడుపు మీద తలపెట్టి కొంతసేపు నిద్రపోయేడు. అతను నిద్రలేచేసరికి మొహం లేని మనిషిలా భయకరంగా వుంది రాత్రి.

నరకం పొగలా నల్లగా వుంది చీకటి.

పాము కళ్ళలా మెరుస్తున్నాయి దూరాన వున్న దీపాలు.

సత్యం నిద్రలేచేసరికి అతనికి స్ఫురించిదల్లా ఆకలి మాత్రమే. తాతని అన్నం పెట్టుమని ఆప్యాయంగా అడిగేడు. దీనంగా అర్థించేడు. భక్తితో ప్రారంభించేడు. ఎన్ని చేసినా దెయ్యం నవ్వు నవ్వుతున్న వెంకన్న లేవలేదు. ఆ నవ్వు వికారం–రాత్రి ఒంటరి తనం – ఒక్కసారి భయపెట్టేయి సత్యాన్ని.

అప్పుడు సత్యం అతి భయంతో, మితిలేని ఆశతో, భరించ లేని బాధతో "ఒక్కసారి లే తాతా!" అని అరిచేడు.

ఆ అరుపుకి కాలువ కరదు కట్టుకుపోయింది.

నక్షత్రాలు భయంతో వణికిపోయేయి.

ఆ అరుపు విన్న నల్లనాగు గజగజ వణికి వంకీలు తిరిగి పోయింది.

ఆ అరుపు పెనుపాము బుసలా వినిపించి గూళ్ళలో పక్షులు కిరకిరలాడిపోయేయి.

సత్యం కేకకి దూరంగా చెట్లుకింద వున్న ముష్టివాళ్ళు పరిగెత్తు కొచ్చేరు. ఆ తర్వాత మార్పులు అతిత్వరగా జరిగిపోయేయి.

కాళ్ళూ, చేతులూ వున్న కొంతమంది ముష్టివాళ్ళు వెంకన్న శవాన్ని ఊళ్ళోకి మోసుకుపోయేరు. చందాలు దండుకోవడానికి.

చేతులున్నా వేళ్ళులేని ఒక ముష్టిది వెంకన్న తాత చెట్టునీ, చెట్టుకింద అరుగునీ, అరుగుమీద డొక్కుల్నీ స్వంతం చేసుకుంది. ప్రపంచంలో మంచీ, చెడు విడి విడిగా వుండవు కాబట్టి, చెట్టూ అరుగూ డొక్కుల్తో సహా మూడేళ్ళ సత్యాన్ని కూడా స్వీకరించిందామె.

ఇవేమి గుర్తులేవు సత్యానికి. కాని మరో రెండేళ్ళు పోయేక ఆ వేళ్ళులేని ఆవిడ తనని ఒక గుడ్డి ముష్టివానికి అసిస్టెంటుగా పది రూపాయలకు అమ్మెయ్యడం, తను "గుడ్డోడు బాబయా, కళ్ళులేని కబోది, దరమం సెయ్యండి బాబూ" అని అరుస్తూ వాడిని కర్ర సాయంతో వీధులన్నీ తిప్పటం, ముష్టి దొరకని రోజుల్లో అదే కర్రచేత గుడ్డివాడు కొట్టిన దెబ్బలు తినడం మాత్రం బాగా గుర్తున్నాయి అతనికి.

దేశాలకి స్వతంత్రం ఏ విధంగా వస్తుందో తెలియదు కాని వయసొచ్చిన కొంతమంది ముష్టి పిల్లలకి ముసిలి ముష్టివాళ్ళ చావు మూలంగా వస్తుంది.

గుడ్డివాడు చచ్చేసరికి సత్యానికి దగ్గర దగ్గర పన్నెండేళ్ళున్నాయి. అంచేత అతను గుడ్డివాడి వారసురాలనని వచ్చిన

ఆమె హక్కులు ధిక్కరించి స్వాతంత్ర్యం ప్రకటించి, దాన్ని నిలువుకున్నాడు.

ఆ తర్వాత అతను ఎలా బతికేడు?

ముష్టి ఎత్తేడు, మూటలు మోసేడు, పేడ అమ్మేడు, బస్సులు కడిగేడు, జోళ్ళు పాలిష్ చేసేడు, వళ్ళు మాలిష్ చేసేడు. లొంగిన వాడికి మస్కాకొట్టేడు. చిక్కిన జేబులు కొట్టేడు. పట్టుబడినప్పుడు తన్నులు తిన్నాడు. పోలీసులకి కేసులు తక్కువైనపుడు జైలుకెళ్ళాడు.

ప్రపంచంలో వున్న ధర్మం, దగా, కరుణ, కాఠిన్యం, త్యాగం, స్వార్థం, నమ్మకం, ద్రోహం, ప్రేమ, విరోధం అన్నీ అతను చూసేడు. వీటిల్లో మొదటవి రమారమి అనలేనంత తక్కువని గ్రహించాడు.

అతనికిప్పుడు ఇరవై రెండేళ్ళ వయసు.

ఇరవై రెండేళ్ళ మొగాడి ఆకలి వున్నాది.

అది తీర్చుకుందామన్న పట్టుదల మాత్రం వుంది.

ఓటులేని పౌరుడు అతను.

కలుసుకున్ననాడే సత్యాన్ని ఇంటికి తీసుకొనివచ్చాడు సింహాచలం. అప్పుడు యింట్లో రాజమ్మ, ఆమె కొడుకు, చెల్లెలు వజ్రం వున్నారు. వజ్రానికి పద్దెమినిది ఏళ్ళుంటాయి. ఆమెని చూడగానే సత్యం గుండె గొంతుకలోకి వచ్చింది.

ఆమె...

రవ్వల పువ్వులా మిలమిలలాడుతోంది.

కొత్త దిండులా ఆరోగ్యంగా ఆకర్షణీయంగా వుంది.

వట్టివేళ్ళ వాసనలా చల్లగా వుంది ఆమె చూపు.

అదే రాత్రి సింహాచలం తన కథనంతా చెప్పేడు సత్యానికి. అది తన కథే అయినా విని భయపడిపోయిన రాజమ్మ "బతుకులో ఏటి మిగిలింది బాబూ, వేసిన సేనూ-ఏసిన సెట్టూ – పెంచిన పసుపూ అన్నీ పోనాయి. పోనివి పేనాలే ..." అని ఆగిపోయింది.

సత్యానికి మనుషుల మంచితనంలో ఏ మాత్రం నమ్మకం లేదు. అంచేత కథ విన్నవెంటనే నువ్వుట్టి ఎర్రి సన్యాసివి గురూ అని సింహాచలం మీద జడ్జిమెంటు చెప్పేడు. క్షణం ఆలోచించి వాల్‌రైట్ నా నొప్పుగుంటా మడచి మంచిగానే వుండాలని, కాని ఎప్పుడు? అవతలోడు ఎడా పెడా లాడించేస్తుంటే ఈప్మీద గుద్దమని వంగి ఏం నాబం?

"మంచోడికి దణ్ణవెట్టు, నానుకాదన్ను"

"కాని సెడ్డోడి దవడపళ్ళు రాలగొట్టే, నేకపోదు ఆడు నిన్ను బతకనీడు. ఆడికాడ మంచి నాబం లేదు. ఆడి జోదు తుడు, అదే నీమీది కెత్తుతాడు. కాని ముందు సెప్పు నువ్వే ఎత్తు,నీకు సలాం ఎడతాడు.

"సెయ్యి సాపుతే నొంగని నోకం సెయ్యెత్తితే నొంగుతాది" అని జ్ఞానోపదేశం చేసేడు. ఆ తర్వాత సింహాచలం యింటి లోనే అతను వుండిపోయేడు.

ఇదంతా కథా ప్రారంభం నాటి రాత్రికి చాలా ముందు.

ఆ రాత్రి బట్టల షాపు బొమ్మ వేపు వెర్రివాడిలాగ చూస్తున్న సింహాచలాన్ని బీడీబంకు దగ్గర నిలబడిన సత్యం "ఏటి గురూ అలా చూస్తున్నావ్?" అని ప్రశ్నించి బీడీషాపులో వేలాడుతున్న బూతు పుస్తకాల్లో తలదూర్చి బీడీ కట్టకొని "సాతనైతే నీ యాద దాని కలాటి కోక్కాను" అని సవాలు సేసి బుర్ర బొమ్మల్లోంచి తీసేడు.

ప్రశ్న, విన్న సింహాచలం పీటల మీద పెళ్ళికూతురిలా సిగ్గు పడి, ఎలా? అని సిగ్గువిడిచి సలహా అడిగేడు.

"నీ జోబీలో ఎంతుందీ?"

జేబు ఖాళీ చేసేడు సింహాచలం-ఏడు బీడీలు. ఒక అగ్గిపెట్టే. రూపాయిన్నర చిల్లరా బైటికొచ్చేయి.

"ఆ రూపాయిన్నర రిచ్చావోడిది. ఏడు బీడీలకి కొకివ్వడు సావుకారు. ఆఖరాకి అగ్గిపెట్టిచ్చినా సరే" అని నవ్వేడు సత్యం.

ఏడవలేక నవ్వేడు సింహాచలం

వ్యూహం పన్నుతున్న సైనికాధికారిలా క్షణం ఆలోచించి, తర్వాత "ఈ యవ్వారం నాకొగ్గీ" అన్నాడు సత్యం కురు క్షేత్రంలో కృష్ణుడిలా.

మర్నాడుదయమే ప్రభుదాసు అస్పత్రికి వెళ్ళి సత్యం రక్తం అమ్మేడు. ఏడు రూపాయలన్నర చేతికొచ్చింది. జేబులు కొట్టడం మానేసేక అంత డబ్బు అతని దగ్గర ఎప్పుడూ లేదు. ఆ ఊళ్ళో ఆ ఆస్పత్రిలోనే రక్తం కొనుగోలు అమ్మకాలు జరుగుతాయి.

ఆ సాయంత్రం సత్యం సలహా మీద సింహాచలం ఆస్పత్రికి వెళ్ళేడు. డాక్టరు పరీక్ష అయ్యేక అతన్ని ఒక గదిలోకి తీసుకొని వెళ్ళేరు.

ఆ గదిలోకి కిటికీలోంచి గాలి కలలో విన్న పాటలా చల్లగా వచ్చింది.

గది మధ్య తెల్ల బల్ల దంతపు బల్లలా మెరుస్తోంది.

గోడల మీద పడిన విద్యుత్కాంతి జారి వెన్నెల ఏరులా ప్రవహిస్తోంది.

కొత్త కరెన్సీ నోట్లలా చప్పుడు చేస్తున్న యూనిఫారాల నర్సుల సింహాచలాన్ని బల్లమీద పడుకోబెట్టేరు.

బల్లమీద పడుకున్న అతనికి బల్లచుట్టువున్న నర్సుల మొహాల నిండుగా నెత్తురు కన్పించింది.

గోడలమీద మేకుల దేఁవుఁడి కళ్ళ నిండా తడికన్పిం చింది.

రక్తం యివ్వడం బాధ అనిపించలేదు సింహాచలానికి డబ్బు పుచ్చుకొని అతను వచ్చేస్తువుంటే పోయిన రిఫ్రెజిరేటరు తాళాలు నర్సులు వెతుకుతున్నారు.

సింహాచలం ఆస్పత్రి గేటు దాటి రెండు పర్లాంగులు వెళ్ళే సరికి వెర్రివాళ్ళు వెంట తరుముతున్నట్లు రిక్షా తొక్కుతూ సత్యం ఎదురువచ్చి దిక్షాదిగి "గోరవై పోనాది గురూ, నీ కొడుకు లారీ కింద పడిపోనాడు. దరమాసుపత్రోళ్ళు రకతం కావా లన్నారు ఇదిగో సీటీ" అని చెప్పి మరి మాటాడ లేకపోయాడు.

ఆ తర్వాత వాళ్ళిద్దరూ పందెం వేసుకున్నవాళ్ళలా రిక్షాలు తొక్కి ఆస్పత్రి చేరేసరికి డ్యూటీలు మారిపోయిన కొత్త నర్సులు యింకా తాళాలు కోసం వెతుకుతూనే వున్నారు. వాళ్ళకి సింహా చలం రక్తం చీటీ చూపించేడు.

నర్సులు ముందు చీటి, తర్వాత బల్లమీదున్న రక్తం సీసా ముందున్న లేబిలూ చదివేరు. వెంటనే సింహాచలం అదృష్ట వంతుడన్నారు. అతనిక్కావలసిన రక్తం తాళాలు పోయిన రిఫ్రె జిరేటర్లో లేదన్నారు. బైట బల్లమీదే వుందన్నారు. ముప్పై రూపా యలిస్తే అది అతనిదే నన్నారు.

సింహాచలం ఆ రక్తం తనదేనని మొరపెట్టుకున్నాడు. వాళ్లు యిచ్చిన ఏడున్నరా తప్పితే తనదగ్గర కాణీ లేదని ప్రమాణం చేసేడు. కావలిస్తే తన వంట్లో వున్న రక్తమంతా తీసుకొమ్మని హామీ ఇచ్చాడు. ఆ సీసా ఇస్తే వాళ్ళ కుక్కగా పుట్టి ఋణం తీర్చుకుంటానని శపథం చేశాడు. "నా కొడుకుని బతికించడం తల్లుల్లారా" అని భూమిలోకి దిగిపోతున్న కొండలా కుప్పకూలి వాళ్ళ కాళ్ళమీద పడి వెక్కి వెక్కి ఏడిచేడు.

అతని ఏడుపుకి చలించకుండా కాగితం మనుషుల్లా వాళ్ళు అతనివేపు చూచేరు. అతని ఏడుపుని అసహ్యించుకుంటూ నర్స్ కుట్టి ఈ ఆంధ్రాస్ అంతా యింతే – మేనర్లెస్ బ్రూట్స్ అన్నట్టు చూసి, "గురవాయా" అని ఒక పొలికేక పెట్టింది.

అంతవరకూ వరండాలో స్తంభంచాటు నీడలో వున్న సత్యం మెరుపులా కదిలి, రక్తం సీసావున్న టేబిలు దగ్గరకు పరుగెత్తి ఆ సీసా పీక ఎడమచేత్తో పట్టుకొని, ఒక కాళీసీసా పీక కుడిచేత్తో పట్టుకొన్ని దాన్ని బేటిలు మీద కొట్టడం, గాజు ముక్కలు విసి రేసిన మణుల్లా తుళ్ళడం రెప్పపాటులో జరిగిపోవడం వల్ల ఎవరూ సమంగా చూడలేదు.

కాని అందరూ సమంగా చూడగలిగింది అతని కుడిచేతిలో సగం పగిలిన సీసా వజ్రాయుధంలా మెరయడం.

అప్పుడతను ఈనిన పులిలా అతి భయంకరంగానూ, క్రూరంగానూ వున్నాడు.

అతన్ని చూసి నర్సులు వేసిన కేకలు వింటే తల్లి కడుపులో పిల్లి కడుపులోనో చచ్చిపోయుండేవి.

"అరుస్తే, సంపేస్తా" అనరిచేడు సత్యం. వాళ్ళు అరుపులు మానేసేరు.

"అడ్డొచ్చినా సంపేస్తా" అని కలిపేడు. అతనికి ఎవరూ అడ్డురాలేదు.

❖ ❖ ❖

కోర్టు గుహలోపలి గుహలా చలిచలిగా చీకటి వుంది.

నీటి మేఘంలా నిండుగా వున్నాడు జడ్జిగారు.

కళ్ళు మూసుకొని కత్తులు విసిరే సర్కస్ వీరుల్లా వున్నారు ప్రాసిక్యూటర్‌గారు.

బాకుల్లా వున్నారు పోలీసులు.

బాతుల్లా వున్నారు సాక్షులు.

ముద్దాయీ తరపు ప్లీడరు వృత్తిరీత్యా చెక్కిళ్ళ నుండి పాలూ, కళ్ళ నుండి నీళ్ళూ కారే వయసులో వున్నాడు.

డాక్‌లో సత్యం బోనులోని వింత జంతువులాగా, కోర్టులో మను షులు అతన్ని పరీక్షిస్తున్న జంతుశాస్త్ర ప్రవీణుల్లాగా వున్నారు.

కేసు విచారణా, ప్రాసిక్యూటర్‌గారి సునిశితమైన వాదనా అతి క్లుప్తంగా ముగిసిపోయేయి.

ముద్దాయి తరపున ప్లీడరు లేస్తూనే ప్రాసిక్యూటరు గారి వేపు చూసేడు. రైల్లో పక్క సీట్లో అందమైన పిల్లాడిని చూసి, ఆ

పిల్లాడికి చాక్‌లెట్ యిద్దామా, వద్దా అని ఆలోచిస్తున్న పెద్ద మనిషిలా ప్రాసిక్యూటరుగారు అతని వేపు చూసేరు.

అతను లేస్తూనే "ఈ కేసు పెద్దది కాదు. ముఖ్యమైనది కాదు, ముద్దాయి మహారాజు కాదు. రమారమి ముష్టి వాడు. కానీ ఈ కేసు చాలాసార్లు చదివేను. ముందు నుండి వెనక్కి వెనక నుండి ముందుకీ చదివేను" అని ఆగేడు.

"తల, వల" చదువుతున్న మనవడిని జమీందారు తాత గారు చూసినట్టు ఉత్సాహపరుస్తూ ఎంకరేజింగ్‌గా చూసేరు ప్రాసిక్యూటరు గారు.

"కన్పించేది చూడకపోవడం బహుశా అల్పుల లక్షణం. కనిపించేది మాత్రం చూడడం మధ్యమం. మరుగున వున్న సత్యాన్ని తరచి చూడడం ఉత్తమం" అని మళ్ళీ ఆగేడతడు.

బాల్యంలోనే భగవద్గీత చదువుతున్న మనవడిని తాతగారు చూసినట్టు గర్వంగా చూసేరు ప్రాసిక్యూటరు గారు అతని వేపు.

"నేను ఎంత చూసినా, ఎంత వెదికినా, నాకు ఈ కేసులో ఎదురయ్యే సమస్య ఒకటే. కళ్ళు మూసుకున్నా కనిపించే క్వొశ్చన్ మార్కు ఒక్కటే".

ముద్దాయి నర్సులను అందర్నీ గాని కొందిరిని గాని చంప దల్చేడా, వారిలోఎవరైనా అడ్డొస్తే ఆమెను చంపి వుండేవాడా అన్న సమస్య అంత ముఖ్యం కాదు".

"ఈ ముద్దాయికీ, యితని లాంటి వాళ్ళకి, వాళ్ళ వాళ్ళకీ జబ్బు చేస్తే చికిత్స చేయించుకుందికి ముఫై రూపాయిలు ఎందు కుండవు? వారికి లేకుండా చేసే పరిస్థితి నిందనీయమైనది కాదా? నిందార్హమే అయితే దానిని సృష్టించిన నేరస్తులు ఎవరు? ఇదే ముఖ్యమైన ప్రశ్న"

మనవఁడు చదువుతున్న భగవద్గీత మద్య బూతు పుస్తకాన్ని చూసి షాక్ తిన్న తాతగారిలా తృళ్ళిపడిన ప్రాసిక్యూటర్‌గారు బూతు పుస్తకాన్ని ముక్కలు ముక్కలుగా చింపేసే నిశ్చయంతో అడ్డు తగిలేడు. "యిప్పుడు ఎలక్షన్లు లేవు. ఇది ఉపన్యాస వేదిక కాదు. యౌవ్వన దశలో వున్న నా స్నేహితుడు అజ్ఞానులను ఆవేశపరిచే చౌకబారు ఉపన్యాసాలు, సత్యా, సత్యాలను సమ దృష్టితో చూచే న్యాయ మూర్తిలో ఎగతాళి మాత్రం కలిసిస్తాయని గ్రహించాలి. కాని కరుణించి కోర్టు అతని లెక్చర్స్ వినదల్చు కుంటే నేను అభ్యంతరం చెప్పను అని కూర్చున్నారు.

ముద్దాయి, ప్లీడరు తన పాత పంథాలోనే ఆర్గ్యుమెంటు చెప్పుకుపోయేడు. నేను రాజకీయాల మనిషిని కాను. ఇది ఉపన్యాస వేదిక కాదని నాకు తెలుసు. ఇది కోర్టు అని, ఇక్కడ న్యాయాన్యాయాలను సాక్ష్యంతోనే తూస్తారని తెలీని మూర్ఖున్ని కాను.

"కాని ఏ మనిషైనా మనిషి కానందుకే శిక్షించాలి. అమా నుషాన్ని మాత్రమే అంతా గర్హించాలి. కాని మనిషి దేవుఁడు కానందుకు, దేవతలా ప్రవర్తించనందుకు దండించడానికి ఏ మనిషికి, ఏ కోర్టుకీ, ఆఖరికి దేవుడి క్కూడా అధికారం లేదనే నా నమ్మకం.

"ముద్దాయి ఉన్న పరిస్థితిలో నేను మరో రకంగా ప్రవర్తించే వాడిని కాను. ఇక్కడున్న వాళ్ళలో ఎవరైనా ఆ పరిస్థితుల్లో మరో విధంగా ప్రవర్తించి వుండ గలిగితే నేను వారికి మొక్కు తాను. వారు మామూలు మనుషులు కారు. మహానుభావులు, దైవ స్వరూపులు"

కాబట్టి ఒక పరిస్థితిలో ఏ ఒక్కరైనా ఒకేలాగ ప్రవర్తిస్తే ఆ ప్రవర్త ఏమైనప్పటికి నేరం కాదు. ఆ పరిస్థితి నింద్యమైనది. దాన్ని సృష్టించిన వారే నేరస్తులు కావచ్చు కాని దానిలో చిక్కు కున్న వారు దోషులు కారు. ముద్దాయి నేరస్తుడా? కాడా? నేరస్తుడే అయితే ఏ శిక్షకు అతను తగుతాడు అన్నవి న్యాయ మూర్తి ఒక్కరే పరిష్కరించవల సిన సమస్యలు....".

అతను ఆర్గ్యుమెంటు చెప్తూవుంటే కోర్టులో దీపాలు గుప్పు మని వెలిగేయి.

తాము నశించిపోయే వరకూ దీపం చుట్టూ తిరిగే దీపం పురుగుల్లా కోర్టులో పాత ఫేన్లు తిరుగుతూనే వున్నాయి.

ముద్దాయి ప్లీడరు వాదన అయిపోయేక ప్రాసిక్యూటరు గారు "నేను ప్రతివాదన చెయ్యదల్చుకోలేదు ఇది చిన్నకేసు. ఏ మేట రాఫ్ నో యింపార్టెన్స్" అని కూర్చున్నారు.

**(జయశ్రీ, సంక్రాంతి 1.1.1969)**